కోర్టు ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

- పాఠశాలను కాపాడాలని హైకోర్టుకు ప్రధానోపాధ్యాయుడి లేఖ
- సుమోటోగా కేసు నమోదు
- నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశం



కమ్మగూడలో ఆక్రమణకు గురవుతున్న స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, డీఈవో తదితరులు

హయత్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి లేఖ అధికారులను కదిలించింది. కొన్నాళ్లుగా సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో చివరికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తికి, గవర్నర్‌కు లేఖ రాస్తూ విన్నవించారు. స్పందించిన న్యాయమూర్తి లేఖను సుమోటోగా స్వీకరించి కౌంటర్‌ను దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. వివరాలిలా ఉన్నాయి.

తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడలోని వీరమణి బిస్కెట్ కంపెనీ యాజమాన్యం పేద విద్యార్థుల చదువు కోసమని 1998లో 20 గుంటల భూమిని స్థానిక ప్రభుత్వ పాఠశాల(విద్యాశాఖ)కు బహుమతిగా ఇచ్చారు. అప్పటి అధికారులు, పాలకులు ఆ భూమిలో కొంతభాగంలో ప్రభుత్వ పాఠశాలను నిర్మించారు. నిధుల కొరతతో ప్రహరీని ఏర్పాటు చేయలేకపోయారు. ఈ భూమి విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.12కోట్లకు చేరింది. పాఠశాలకు స్థలం ఇచ్చి సుమారు 26 సంవత్సరాలు కావస్తుండడంతో చుట్టూ అనేక కాలనీలు వెలిశాయి. సమీప కాలనీలకు రోడ్డు లేదనే పేరుతో పాఠశాల స్థలం మధ్యనుంచి రోడ్డును వేశారు. విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.దాసు, విద్యాకమిటీ చైర్మన్ లక్ష్మయ్య గగ్గోలు పెట్టి పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో సదరు ప్రధానోపాధ్యాయుడు గత జూన్ 25న తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, రాష్ట్ర గవర్నర్‌కు ఉత్తరం రాశారు. దీంతో హైకోర్టు ఉపాధ్యాయుని ఉత్తరాన్ని సుమోటోగా తీసుకుని నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, మున్సిపల్, రెవెన్యూ, సర్వే అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

కదిలిన యంత్రాంగం

ఇప్పటి వరకు పట్టించుకోని అధికారులు కోర్టు ఆదేశంతో శనివారం కమ్మగూడ పాఠశాలను సందర్శించారు. ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, అబ్దుల్లాపూర్‌మెట్ మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, సర్వేయర్ కావ్య, ఆర్ఐ నిజాంతో పాటు మున్సిపాలిటీ, పంచాయతీ రాజ్, మండల పరిషత్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు శనివారం పాఠశాలను సందర్శించారు. ఎక్స్‌కవేటర్‌తో రోడ్డుకు అడ్డంగా కందకాన్ని తవ్వారు. పాఠశాలకు ఉండాల్సిన స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న చెరుకూరి ప్రవీణ్‌చౌదరి, రంగయ్యచౌదరి, శివచౌదరి తదితరులు

ఘనంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుక

- శుభాకాంక్షలు తెలిపిన కమ్మసంఘం సభ్యులు

వనస్థలిపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కమ్మసంఘం నాయకులు చెరుకూరి ప్రవీణ్‌చౌదరి ఆధ్వర్యంలో పలువురు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, కేక్ కట్‌చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌చౌదరి మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లోనే ఏ నియోజకవర్గం అభివృద్ధి చెందనంతగా ఎల్బీనగర్‌ను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభివృద్ధి చేశారని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమ్మసంఘం ప్రతినిధులు రంగయ్యచౌదరి, వెంకటేశ్వర్‌రావు, డి.శివచౌదరి, పి.రాజేంద్రప్రసాద్, గంగాధర్‌రావు, రవిచంద్ర, కట్ట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో సీసీ రోడ్డు ప్రారంభం

చాదర్‌ఘాట్, జూలై 27(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద నూతన సీసీ రోడ్డును రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రవెల్లి మంజులరెడ్డి, దాచెపల్లి శ్రీపాల్‌రెడ్డి, యువజన నాయకులు జైపాల్‌రెడ్డి, జేబీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'అంధ బాలికల గృహంలో రక్షణ చర్యలు చేపట్టండి'

సైదాబాద్, జూలై 27(ఆంధ్రజ్యోతి): అంధ బాలికల ప్రభుత్వ వసతి గృహంలో రక్షణ చర్యలు చేపట్టాలని సైదాబాద్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలత డిమాండ్ చేశారు. శనివారం మలక్‌పేట బీ బ్లాక్‌లోని అంధుల వసతి గృహాన్ని డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆమె సందర్శించారు. బాలికలతో మాట్లాడి ఈ నెల 7న జరిగిన ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

'ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి'

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని అధ్యక్షుడు అంతటి ధనుంజయగౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక మండల ప్రధాన కార్యదర్శి గుండె రవీందర్ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని వైఎస్ఆర్ గార్డెన్‌లో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ధనుంజయగౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జంగంగౌడ్, కృష్ణకుమార్ యాదవ్, జంగయ్య, అక్బర్, రాజు, జంగయ్య, లక్ష్మణ్, క్రాంతి, రాములు, శ్రీశైలం, చిత్రం కృష్ణ, జంగంగౌడ్, గుర్రని వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ ఎంప్లాయీస్‌గా గుర్తించాలి'

ఎల్బీనగర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులలో ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి వారందరిని రెగ్యులర్ ఎంప్లాయీస్‌గా గుర్తించాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిమాండ్ చేస్తూ శనివారం జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయాలలో వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 30న చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్మికులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, మండల అధ్యక్షుడు రాములుగౌడ్, పారిశుధ్య కార్మికులు ధనంజయ, హంసమ్మ, ప్రమీల, ఆండాలు, చంద్రమ్మ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో రోడ్లకు మరమ్మతులు చేయించండి

- కమిషనర్‌ను కోరిన బీజేపీ నాయకులు

హయత్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్‌లోని పాత గ్రామంలోని రోడ్లకు వెంటనే మరమతులు చేయించాలని కోరుతూ తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డికి బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి రమేష్, బీజేపీ సీనియర్ నాయకుడు శ్రావణ్‌కుమార్‌గౌడ్ శనివారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని గుండ సత్యనారాయణ ఇంటి నుంచి సెయింట్ పాల్ కళాశాల వరకు, మున్సిపాలిటీ కార్యాలయం నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు, అదే విధంగా ఏపీనగర్ దేవాలయం నుంచి గ్రామం శివారు వరకు రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని పేర్కొన్నారు.

బోనాల ఉత్సవాలకు సర్వం సిద్ధం

- ఆలయాలు ముస్తాబు



రంగులు వేసిన మాతృశ్రీ కాలనీలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం



బోనాలకు ముస్తాబైన ఖిల్లా మైసమ్మ ఆలయం



నాగార్జున స్కూల్‌లో నిర్వహించిన శాకంబరీ వేడుకల్లో పాల్గొన్న చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి తదితరులు

సైదాబాద్, జూలై 27(ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలకు సైదాబాద్, మాదన్నపేట, మలక్‌పేట పరిసర ప్రాంతాలలో ఆదివారం, సోమవారం జరిగే ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలకు అమ్మవారి ఆలయాలను రంగులతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. జీహెచ్ఎంసీ అధికారులు ఆలయాల వద్ద రోడ్లకు ప్యాచ్ వర్క్‌లు, ప్రత్యేక వీధిదీపాలు, చెత్త కుప్పలు లేకుండా చర్యలు చేపడుతున్నారు. మాతా మైదాన్‌లోని విజయదుర్గమాత దేవాలయం, జీవనజ్యోతి సంఘంలోని జయదుర్గాదేవి ఆలయం, మాతృశ్రీకాలనీలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం, రెడ్డిబస్తీలోని నాగులమ్మ టెంపుల్. మూడుగుళ్ళు విష్ణునగర్‌లోని పోచమ్మ దేవాలయం, పెద్దతోటలోని అమ్మవారి ఆలయం, కరన్‌బాగ్, పల్టన్, మాదన్నపేట, సింగరేణి కాలనీలలోని అమ్మవారి దేవాలయాలలో బోనాల మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. సైదాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం జరిగే ఘటాల ఊరేగింపులో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సైదాబాద్, మాదన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. కీలక ప్రాంతాలలో ప్రత్యేక సాయుధ పోలీస్ పికెట్‌లను మోహరించనున్నారు.

ఎన్‌టీఆర్‌నగర్‌లో..

ఎల్బీనగర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్‌నగర్‌లోని ఖిల్లా మైసమ్మ ఆలయంలో బోనాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఖిల్లా మైసమ్మ ఆలయంలో బోనాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు మంత్రి సీతక్క ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు.

చంపాపేటలో...

చంపాపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని నల్ల, ఎర్ర పోచమ్మ ఆలయం బోనాల వేడుకలకు ముస్తాబైంది. ఆలయాన్ని సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవార్లకు బోనాల సమర్పణ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. సోమవారం ఫలహారబండి ఊరేగింపు కార్యక్రమంను నిర్వహించనున్నట్లు తెలిపారు.

రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో..

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూలై 27(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో ఆదివారం బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బోనాల ఉత్సవాలలో న్యాయాధికారులు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ, మీనాక్షి, రవికుమార్, భరత్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో బోనాల వేడుకలు..

చంపాపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని లోటస్‌ల్యాప్ స్కూల్‌లో శనివారం విద్యార్థులు బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శేషఫణి తదితరులు పాల్గొన్నారు.

- కర్మన్‌ఘాట్ గాయత్రీనగర్ చౌరస్తాలోని నాగార్జున ది నెక్స్ట్ జెన్ స్కూల్‌లో విద్యార్థులు శాకంబరీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.రవీందర్‌రెడ్డితదితరులు పాల్గొన్నారు.
- దుర్గాభవానీనగర్‌కాలనీ సంతోష్‌నగర్ రోడ్‌లోని భాష్యం ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు బోనాల వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దేవదాస్, కో-ఆర్డినేటర్ సంతోషి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్‌లోని నాగార్జున మాంటిస్సోరి ఐఐటీ ఒలింపియాడ్ స్కూల్‌లో శాకంబరి వేడులకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ జి.విఠల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డి.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్‌లో ఘనంగా ఘటాల ఊరేగింపు

బాలాపూర్‌లో ఘటాల ఊరేగింపులో పాల్గొన్న మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు మహేశ్వరీజైహింద్‌కుమార్, పి.సుదర్శన్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు అమరేందర్‌రెడ్డి, నాయకులు

సరూర్‌నగర్, జూలై 27(ఆంధ్రజ్యోతి)



పదవ తరగతి టాపర్‌లకు ఘన సన్మానం

హయత్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో టాపర్‌గా నిలిచిన ముగ్గురు విద్యార్థులను శనివారం రాగన్నగూడలోని జిల్లా పరిషత్ పాఠశాలలో క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పదవ తరగతి ఫలితాల్లో బాటసింగారం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన మేఘన 10/10, కోహెడ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన దీక్షితకు 9.8, రాగన్నగూడ జిల్లా పరిషత్ పాటశాలకు చెందిన విద్యార్థిని దుర్గాలక్ష్మీ 9.8 జీపీఏ సాధించారు. ముగ్గురు విద్యార్థులను రాగన్నగూడ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, క్లాస్‌మెట్ క్లబ్ రాష్ట్ర అధ్యక్షుడు సోల శ్రీనివాసులు, ఎల్బీనగర్ అధ్యక్షుడు హరినాథ్, సభ్యులు పాల్గొన్నారు.

ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థికి ల్యాప్‌టాపు...

తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్‌లోని సీఆర్‌పీఆఫ్ కాలనీకి చెందిన మూడావత్ నాగేశ్వరీ రాజస్థాన్‌లోని ఐఐటీలో సీటు సాధించింది. ఈ సందర్భంగా శనివారం సీఆర్‌పీఆఫ్ కాలనీలోని శ్రీ ప్లేస్కూల్ యాజమాన్యం మూడావత్ నాగేశ్వరికి ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. స్థానిక 13 వార్డు కౌన్సిలర్ బొక్క శ్రీలత గౌతంరెడ్డి, 14 వార్డు కౌన్సిలర్ రవీందర్ రెడ్డిల చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌ను నాగేశ్వరికి అందజేశారు. ఇటీవల వెలువడిన యూపీఎస్‌సీ ప్రిలిమినరీ ఫలితాలలో అర్హత సాధించి మెయిన్స్ కోసం సన్నద్ధమవుతున్న విద్యార్థి శరత్‌చంద్రారెడ్డికి రూ. 50 వేల చెక్కును పాఠశాల యాజమాన్యం అందజేసింది. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ప్రవీన్‌కుమార్, సీఆర్‌పీఆఫ్ కాలనీ అధ్యక్షుడు గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి రమేష్ చారి, సురేష్, నాగరాజు, వర్మ, శ్రీనివాస్, అర్జున్, సంతోస్, ప్రవీణ్ నాయక్, మకత్‌లాల్ తదతరులు పాల్గొన్నారు.



రాజస్థాన్ ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న శ్రీ ప్లేస్కూల్ యాజమాన్యం, సిబ్బంది

హనుమాన్ ఆలయంలో రాచకొండ సీపీ పూజలు



హనుమాన్ ఆలయంలో సీపీ సుధీర్‌బాబు

చంపాపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చంపాపేట్ డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానాన్ని శనివారం రాత్రి రాచకొండ సీపీ సుధీర్‌బాబు సందర్శించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని వినాయకుడు, ధ్యానాంజనేయ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. సుధీర్‌బాబుకు వేద ఆశీర్వచనం చేసిన అర్చకులు ఆయనకు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బిల్లకంటి కిరణ్‌కుమార్ గుప్తా, మధుసాగర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్ పెంచి, ప్రజల నమ్మకం సాధించాలి

హైదరాబాద్ సిటీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉండి 100, 112 నంబర్లకు ఫోన్ చేసిన వారి వద్దకు వీలైనంత త్వరగా చేరుకొని, ప్రజల నమ్మకాన్ని సాధించాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు సూచించారు. డయల్ 100, 112 వ్యవస్థలను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా శనివారం కమిషనరేట్‌లో వీడియో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లూకోట్స్, పెట్రోలింగ్ బృందాల పనితీరును పరిశీలించారు. విజిబుల్ పోలీసింగ్ పెంచాలని, డయల్ 100 నంబర్‌పై అవగాహన పెంచడం వంటి పలు సూచనలు చేశారు. సమావేశంలో డీసీపీలు పద్మజ, ప్రవీణ్‌కుమార్, రాజేష్‌చంద్ర, కరుణాకర్, అరవింద్‌బాబు, సునీతారెడ్డి, ఏసీపీలు నరేందర్‌గౌడ్, సీఆర్‌బీ రమేష్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

చాదర్‌ఘాట్, జూలై 27(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. మలక్‌పేట ఎస్‌ఐ సీహెచ్ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లాకు చెందిన వి.గోపాల్(50) ముసారాంబాగ్ చౌరస్తాలోని స్టార్ హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 26న మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో గోపాల్ కుప్పకూలి పడిపోయాడన్న సమాచారం మేరకు హోటల్ యాజమాని మహ్మద్ సల్మాన్ సంఘటనా స్థలానికి వెళ్లాడు. పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం చేయించినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన శివ, భార్య అల్లూరి స్వప్న(29)తో కలిసి రెండు నెలల క్రితం అబ్దుల్లాపూర్‌మెట్‌కు వలసొచ్చి అద్దెకు ఉంటున్నాడు. శివ తాపీమేస్త్రీ కాగా స్వప్న ఇంట్లోనే ఉంటుంది. వీరికి 5 నెలల పాప ఉంది. కొంత కాలంగా స్వప్న తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసింది. శనివారం భర్త పనికి వెళ్లిన అనంతరం సాయంత్రం సీలింగ్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శివ ఇంటికి వచ్చి చూడగా భార్య ఉరేసుకుని కనిపించింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెరాయిన్ సరఫరా చేస్తున్న తండ్రీకుమారుల అరెస్ట్

- రాజస్థాన్‌లో కొనుగోలు.. నగరంలో విక్రయం

హైదరాబాద్ సిటీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రవాణా, విక్రయం, సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. రాజస్థాన్ నుంచి హెరాయిన్ సరఫరా చేస్తున్న తండ్రీకుమారులని మహేశ్వరం ఎస్‌ఓటీ, బాలాపూర్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. నేరేడ్‌మెట్ కమిషనరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితుల వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్ రత్లాం జోరా ప్రాంతానికి చెందిన హనీఫ్ షా అలియాస్ హనీఫ్(65) స్క్రాప్ వ్యాపారం చేస్తున్నాడు. ఇతడి కుమారుడు సిద్దిక్ షా(31) కాస్మొటిక్స్ వ్యాపారం చేస్తున్నాడు. వీరి ఇద్దరి సంపాదన కూడా కుటుంబ ఖర్చులకు సరిపోకపోవడంతో అధిక సంపాదన కోసం డ్రగ్స్ విక్రయాలు ప్రారంభించారు. రాజస్థాన్ ప్రతాప్‌ఘడ్‌కు చెందిన మోంటూతో పరిచయం పెంచుకున్నారు.

అతడి వద్ద నుంచి హెరాయిన్ కొనుగోలు చేసి ఎక్కువ ధరకు నగరంలో విక్రయిస్తున్నారు. వీరు మోంటూకు రూ.6 లక్షలు ఇచ్చి, 100 గ్రాముల హెరాయిన్ కొనుగోలు చేశారు. అక్కడి నుంచి హెరాయిన్ తీసుకొని నగరానికి వచ్చి బాలాపూర్‌లో ఉన్నారు. హైదరాబాద్‌లో విక్రయించే ప్రయత్నంలో ఉండగా వీరి దందాపై పక్కా సమాచారమందుకున్న ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. హనీఫ్, సిద్దిక్‌లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.12 లక్షల విలువైన 100 గ్రాముల హెరాయిన్, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ విక్రేతలను అరెస్ట్ చేసిన ఎస్ఓటీ, పోలీసులను సీపీ అభినందించారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ప్రతినిధులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 27(ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో కుంట్లూర్‌లోని గాంధీయన్ బీఈడీ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్ర పటానికి గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్‌రెడ్డి, న్యాయవాది మదన్‌యాదవ్, ప్రిన్సిపాల్ కృష్ణయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలామ్ సేవలను కొనియాడారు.

మాజీ రాష్ట్రపతికి ఘనంగా నివాళులు

చంపాపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకొని కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీఎల్ కాంప్లెక్స్ ముందు ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి డీఆర్‌డీఓ టౌన్‌షిప్ ఎస్టేట్ మేనేజర్ డాక్టర్ షేక్ గౌస్ మొహిద్దీన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కలాం దేశానికి చేసిన సేవలను ఆయన కొనియాడారు.

కాంగ్రెస్ నేత బిక్షపతిగౌడ్ కన్నుమూత



బిక్షపతిగౌడ్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్

కొత్తపేట, జూలై 27(ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు, కొత్తపేట మాజీ సర్పంచ్ లింగాల బిక్షపతిగౌడ్ నాగోల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలోని ఆయన నివాసంలో శనివారం మరణించారు. బిక్షపతిగౌడ్ పార్థివదేహాన్ని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి సందర్శించి నివాళులర్పించి, ఆయన కుటుంబభ్యులను పరామర్శించారు. కొత్తపేట స్మశానవాటికలో అయన అంత్యక్రియలు నిర్వహించారు. బిక్షపతి అంతిమయాత్రలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ లింగాల నాగేశ్వరరావు, రాహుల్‌గౌడ్, కిషోర్‌గౌడ్, శ్రీపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, జేబీగౌడ్, బద్రినాథ్, కిరణ్ పాల్గొన్నారు.

పది నెలల చిన్నారికి అరుదైన వ్యాధి

- చికిత్స కోసం స్పందించిన సీఎం కార్యాలయం



ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన చిన్నారి ఆరాధ్య తల్లిదండ్రులు

ఇబ్రహీంపట్నం, జూలై 27(ఆంధ్రజ్యోతి): భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి వైద్య సాయాన్ని అందించేందుకు సీఎం కార్యాలయం ముందుకు వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పొల్కంపల్లికి చెందిన పొన్నాల రాజశేఖర్-తేజశ్రీ దంపతులకు పది నెలల చిన్నారి ఆరాధ్య గాచర్ డిసీజ్(లైసోమల్ స్టోరేజ్ డిజార్డర్)తో బాధపడుతోంది. చిన్నారికి బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు సుమారు రూ.20-25లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగించే వారికి వైద్య ఖర్చులు భరించే స్తోమత లేక పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డిని సంప్రదించారు. ఆయన శనివారం భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి విషయం వివరించారు. ఎంపీ వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి సహాయ కార్యదర్శి సంగీత సత్యనారాయణతో ఫోన్‌లో మాట్లాడారు. ఆ చిన్నారికి వైద్యం చేయించే బాధ్యత తనదని కూడా ఎంపీ భరోసా ఇచ్చారు. కాగా, అదే సాయంత్రం సీఎంవో కార్యాలయం నుంచి పాప తండ్రి రాజశేఖర్‌కు ఫోన్ కాల్ వచ్చింది. పూర్తి సమాచారాన్ని తెలుసుకున్న అధికారులు లక్డీకాపూల్ సీఎస్‌జే ఆస్పత్రిలో సోమవారం చిన్నారిని చేర్చాలని తెలిపారని రాజశేఖర్ చెప్పారు.

కుటుంబ సభ్యుల చెంతకు తప్పిపోయిన బాలుడు



బాలున్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి

వనస్థలిపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం. పోలీసులు తప్పిపోయిన బాలున్ని పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సాకు చెందిన బాల్‌దేవ్ నిషత్, సంగీత నిషత్ దంపతులు తన కుమారుడు వేద నిషత్(3)తో కలిసి సాగర్ రింగ్‌రోడ్ సమీపంలోని వెంకటేశ్వర కాలనీలో ఉంటున్నారు. శనివారం వేద నిషత్‌తో కలిసి సంగీత నిషత్ సాగర్ రింగ్‌రోడ్ సమీపంలోని శ్రీకృష్ణనగర్ కాలనీలో పండ్ల గోదాంలో కూలి పనులకు వెళ్లింది. వేద నిషత్ ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. దీంతో తన కుమారుడు కనిపించడం లేదని సంగీత నిషత్ వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టగా, పండ్ల గోదాంలోని ఓ ప్రదేశంలో వేద నిషత్ కనిపించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తక్షణమే స్పందించి తమ కుమారుడి ఆచూకీ కనిపెట్టి తమకు అప్పగించిన పోలీసులకు చిన్నారి తల్లిదండ్రులు దన్యవాదాలు తెలిపారు.



కమ్యూనిస్టు నాయకుడు ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మస్కు నరసింహ 4వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం తుర్కయంజాల్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీఐటీయూ జిల్లా నాయకుడు డి.కిషన్, సీపీఎం నాయకులు - హయత్‌నగర్, జూలై 27(ఆంధ్రజ్యోతి)